నిస్సీ
జయధ్వజము
విడి పత్రిక రూ 8/-
ఫిబ్రవరి - 2017 | క్రైస్తవ ఆధ్యాత్మిక మాస పత్రిక | సంవత్సరపు చందా రూ. 100/-

# కిరీటమందలి రత్నము

**"నా జనులు యెహోవా దేశములో కిరీటమందలి రత్నములవలె నున్నారు"**
- (జెకర్యా 9:16)

మన ప్రభువు మనగురించి పలుకుతున్న పలుకులివి. **"నా జనులు"**. ఎవరు ఈ జనులు? **"నాజనులు"** అని ఈ భూమిమీద జన్మించిన మనుష్యులందరిని పిలుస్తున్నాడా? లేక ప్రత్యేకింపబడిన గుంపువారిని చూసి **"నాజనులు"** అని అంటున్నాడా? మన దేశంలో ఉన్నవారందరిని **"నాజనులు"** అని అంటున్నాడా? లేక మందిరములో దేవునిసంఘములో ఉన్న నీ గురించి మాట్లాడుతున్నాడా? ప్రభువు యొక్క ఉద్దేశమేమిటి? ఆయన ఆలోచన ఏమిటి? ఆయన ఏమి చెప్పాలని అనుకుంటున్నాడు?

ఈ భూమిమీద ప్రభుకోసం ప్రత్యేకింపబడిన ఒక జనాంగం ఉన్నది. వారే విశ్వాసులకు తండ్రియైన అబ్రహాము సంతానము. ఈ అబ్రహాము ఎవరు అంటే విగ్రహారాధన చేసే ఒక కుటుంబములో జన్మించినవాడు. అతని కులవృత్తి ఏమిటంటే వారు బొమ్మలు చేసేవారు, వాటిని మార్కెట్‌లో అమ్మేవారు. అలాంటి కుటుంబములో జన్మించిన అబ్రహామును దేవుడు అన్యకుటుంబము నుండి పేరుపెట్టి పిలిచి, తానున్న దేశములో నుండి అతన్ని బయటకు తీసుకువచ్చి అతనికి సంతానాన్ని ప్రసాదించి, ఆ సంతానాన్ని ఇశ్రాయేలు ప్రజలుగా ఒక ఇశ్రాయేలు దేశముగా మార్చాడు.

ఈరోజు అబ్రహాము సంతానము ఈ భూమిమీద రెండు రకాలైన గుంపులవారు ఉన్నారు. భార్యయైన శారా తనకింకా పిల్లలు కలగడం లేదని తన దగ్గర పని మనిషిగా ఉన్న హాగరును అబ్రహాముకు భార్యగా ఇచ్చింది. ఈ హాగరుకు సంతానం కలిగింది. ఈ సంతానమే ఇష్మాయేలు సంతానము అనగా అరబ్ (ముస్లిం) దేశాలు.

తర్వాత శారా గర్భం ధరించి వాగ్దానం చేయబడిన రీతిగా వాగ్దానపుత్రుడైన ఇస్సాకుకు జన్మనిచ్చింది. శారాకు పుట్టిన సంతానమే ఇశ్రాయేలు ప్రజలు. అయితే హాగరు సంతానాన్ని నా జనులు అనకుండా వాగ్దానం చేయబడిన శారా ద్వారా కలిగిన సంతానాన్నే **"నాజనులు"** అని అంటున్నాడు. శారాకు ఎవరైతే జన్మించారో ఆ సంతానాన్ని **"నాజనులు"** అని అంటున్నాడు. నా జనులు యెహోవా దేశములో కిరీటమందలి రత్నములవలె ఉన్నారు. నా జనులు కిరీటంలో రత్నాలు ఎలా ధగధగమెరుస్తుంటాయో, ఎలాగైతే కాంతిని వెదజల్లుతూ ఉంటాయో ఆ విధంగా నా జనులు ఉన్నారు.

అయితే మనసంగతేమిటి? మనం హాగరుకు జన్మించినవారము కాము, శారాకు జన్మించినవారము కాము. మన రంగువేరు, మన పూజలు వేరు, మన సంస్కారాలు వేరు, మనము ఎవరము? మనమెందుకు ఈ వాక్యాన్ని ధ్యానించాలి? మనకు దీనికి సంబంధమేమిటి? ఎందుకు యేసుప్రభువు పేరున పాటలు పాడుతున్నాము? ఎందుకు ఆరాధన చేస్తున్నాం? ఎందుకు ఆయన మాటలు వింటున్నాము? కిరీటమందలి రత్నములవలె వున్నారని మనతో ఎందుకు దేవుడు మాట్లాడుతున్నాడు?

మనం దేవునిచేత ఏర్పరచబడిన ప్రజలం. మనం ఎలా ఏర్పరచబడ్డాము? స్వయంగా యేసుప్రభువే ఈ లోకానికి దిగివచ్చి మనందరికోసం రక్తం కార్చి ప్రాణముపెట్టి తిరిగిలేచి నీ నా పాపములన్ని ఆయన రక్తముతో కడిగి మనలను నీతి మంతులుగా తీర్చి మనలను ఆయన ప్రజలముగా ఆయన స్వాస్థ్యముగా ఆయన సొత్తుగా మార్చుకున్నాడు. ఆయన స్వరక్తమిచ్చి నిన్ను నన్ను కొన్నాడు. నీకు రక్షణ బాప్తీస్మం, అభిషేకం ఇచ్చాడు.

రక్షింపబడక ముందు అడవి ఒలీవచెట్టుగా ఉన్న నిన్ను నన్ను దేవుడు తీసుకొని స్వభావికమైన ఒలీవచెట్టుతో అనగా ఇశ్రాయేలు ప్రజలతో నిన్ను నన్ను అంటుకట్టాడు. నిజమైన ఒలీవచెట్టు ఇశ్రాయేలు ప్రజలైతే అడవిఒలీవ చెట్టువలె ఉన్న మనలను యేసయ్య తన సిలువ త్యాగము ద్వారా ఆయన రక్తముచేత మనలను కడిగి ఇశ్రాయేలు ప్రజలైన ఒలీవచెట్టుతో మనలను అంటుకట్టాడు. అందుకే ఇశ్రాయేలు దేవుడే మన దేవుడైనాడు. ఇశ్రాయేలుయొక్క ధర్మశాస్త్రాన్ని ధ్యానిస్తున్నాము. ఆయనను ఆరాధిస్తున్నాము. బైబిల్ మాది, వీరుపట్టుకొని తిరుగుతున్నారేమిటి? అని ఇశ్రాయేలీయులు మనలను విచిత్రంగా చూస్తారు. అయితే వారికి ఈ విషయం తెలియదు. యేసుప్రభువు ద్వారా మనందరం అంటుకట్టబడినవారమని, మనం ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలీయులమని వారికి తెలియదు. వారు అబ్రహాము సంతానమైతే మనం విశ్వాసము ద్వారా అబ్రహాము సంతానముగా మారిపోయాము. విశ్వాసులకు తండ్రి అబ్రహాము. భార్యయైన శారా ద్వారా అబ్రహాముకు పుట్టిన సంతానము ఇశ్రాయేలు ప్రజలు. దాసియైన హాగరు ద్వారా అబ్రహాముకు పుట్టిన సంతానము ఇష్మాయేలు (ముస్లిం) ప్రజలు. విశ్వాసముద్వారా అబ్రహాముకు పుట్టిన సంతానము మనమే. అందుకే మనలను కిరీటములోని రత్నములవలె

ఉన్నారని సంభోధిస్తున్నాడు.

## 1. రత్నమువలె ఉన్నారు

ప్రియమైన దైవజనాంగమా! ఇప్పుడు ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలీయులమైన మనతో "నాజనులు" అని ప్రభువు సెలవిస్తున్నాడు. "నా జనులు యెహోవా దేశములో" దేశం అంటే క్రీస్తు శరీరమనెడి సంఘము. దేవుని సంఘములో ప్రజలు ఎలా ఉన్నారంటే కిరీటమందలి రత్నములవలె ఉన్నారు. సంఘములో దేవుని బిడ్డలు ఒకగాజుపెంకుగా కాదు, ప్లాస్టిక్ వస్తువుగా కాదు, ఒక పనికిరాని వస్తువుగా నీవు దేవుని మందిరములో లేవు. నీవు ఒక రత్నంవలె ఉన్నావు. రత్నముతో నిన్ను పోల్చాడు.

నిన్ను ఎవరైనా, నీ ఊరివారుగాని, నీ ఇంటివారుగాని నిన్ను రత్నంలాగా చూసారా? జీవరత్నం, రాజరత్నం, యేసురత్నం, ప్రేమరత్నం అని పేరు పెట్టుకున్నావు. కాని రత్నం వలె నిన్ను చూసారా? మీ అమ్మనాన్నలు ఎప్పుడైనా రత్నంగా చూసారా? నీ కోడలు నిన్ను ఎప్పుడైనా రత్నంగా చూసిందా? నీ అత్త ఎప్పుడైనా రత్నంగా నిన్ను చూసిందా? నీ పిల్లలను ఎప్పుడైనా రత్నంగా చూసావా? నీ భర్త నిన్ను రత్నంగా చూసాడా? నీ భార్య నిన్ను రత్నంగా చూసుకుందా? అయితే ఆయన సంఘ బిడ్డలనందరిని రత్నంగా అంటే విలువైన వ్యక్తిగా దేవుడు నిన్ను చూస్తున్నాడు. రత్నం విలువ నీకు తెలుసా? లక్షలకోట్ల రూపాయల వెల కలిగి ఉంటుంది. ఈ రత్నాలు బంగారు కిరీటంలో పొదిగింపబడి ఉన్నాయి. దేవుడు మనకిస్తున్న విలువ ఇదే.

భూమిఆకాశములను సృష్టించిన దేవుడు ఇచ్చిన ఇంతటి విలువ నీ యింటివారు నీ ఊరివారు ఎప్పుడైనా నీకు ఇచ్చారా? ఈలోకంలో ఎవరెవరినో ప్రేమించావు, నీ హృదయములో ఎవరెవరికో స్థానమిచ్చావు. పనికి రాని మట్టి నుండి దేవుడు మనలను చేసాడు. చివరికి చనిపోతే మంటికి మన్ను అవుతాము. మనలో ఏమంచితనము లేదు, మొన్నటివరకు పాపంలో, శాపంలో దేవునికి వ్యతిరేఖంగా బ్రతికిన వారము. అలాంటి మనలను దేవుడు ఆయన సంఘములో చేర్చుకొని ఒకరత్నంవలె నిన్ను మార్చాడు.

ఒక విలువైన వ్యక్తిగా దేవుడు నిన్ను చూస్తున్నప్పుడు, విలువైన రక్తంతో నన్ను కడిగాడు, విలువైన రక్షణ నాకు ఇచ్చాడు కాబట్టి ఈ లోకంలో నేను చాలా విలువైన వ్యక్తిని, నేను రత్నంలాంటివాడనని, విలువలేనివానిగా నేను బ్రతకకూడదని నీచమైన ప్రతికార్యమును వదిలిపెట్టి పరిశుద్ధంగా రత్నంగా జీవించాలనే ఆశతో నీవు జీవించాలి. నీకు విలువనిచ్చినవాని (దేవుని) విలువ కాపాడుతున్నావా? లేక నీవుచేసే అపవిత్రమైన కార్యాలద్వారా దేవుని విలువ తీసే పనులు చేసి దేవుని నామాన్ని నలుగురిలో అవమానపరుస్తున్నావా? ఒక్కసారి ఆలోచించు. కుక్కకు ఎవరైనా విలువనిస్తారా? అదే ఏనుగు అయితే అది చచ్చినా పదివేలు బ్రతికినా పదివేలు గనుక దాన్ని విలువైనదిగా మనుష్యులు చూస్తారు. అల్పులమైన మనల్ని దేవుడు ప్రేమించి ఎక్కడో పెంటకుప్పలో పడి

కుక్కలా తిరిగినా, పందిలా పొర్లినా మన బ్రతుకులను చేరదీసి జీవముకలిగిన క్రీస్తుశరీరమనెడి సంఘములో మనలను చేర్చి ఆయన కిరీటములో రత్నంవలె మనలను పొదిగించాడు. పొదిగించబడిన నీవు ఎంత విలువైన వ్యక్తిగా బ్రతుకుతున్నావు? ఎంత విలువైన విశ్వాసిగా జీవిస్తున్నావు? ఎంత విలువైన సేవకునిగా బ్రతుకుతున్నావు? సమాజంలో, ఊరిలో, సంఘములో విలువపోగొట్టుకునే పనులు ఏమి చేయకూడదు. దేవుడు నిన్ను విలువైన వ్యక్తిగా (రత్నం) గా చూస్తుంటే, సమాజంలో అలా బ్రతుకకుండా, ఆవిలువ కాపాడుకోకుండా అసహ్యమైన కార్యాలుచేసి విలువలేని వ్యక్తిగా నీవు బ్రతికి దేవుని నామానికి అవమానం కలిగించేవారిగా జీవించడము ఎంతవరకు న్యాయమో ఆలోచించు!

## 2. కిరీటమందలి రత్నము

**నా జనులు యెహోవా దేశములో కిరీటమందలి రత్నములవలె నున్నారు (జెకర్యా 9:16)**

రత్నాన్ని ఉంగరాలమీద, కవచాలమీద, కొన్ని వస్త్రాలమీద పొదిగిస్తారు. వాటిమీద కాకుండా నిన్ను ఎక్కడ పొదిగించాడంటే కిరీటంలో పొదిగించాడు. కిరీటం తలమీద ఉంటుందా? కాళ్ళక్రింద ఉంటుందా? కిరీటం ఎప్పుడు తలమీదే ఉంటుంది. నీవు మామూలు రత్నానివి కావు. నీవు తలమీద ఉన్న కిరీటంలోని రత్నానివి. కిరీటాన్ని మించిన స్థానం ఏదైనా ఉందా? దేవుడు నీకు ఇచ్చిన స్థానాన్ని చూడు! దేవుడు నీకు ఇంత ఉన్నత స్థానమిస్తే దేవునికి నీవు ఎంత గొప్ప స్థానమిస్తున్నావు? బైబిల్‌కి ఎంత విలువనిస్తున్నావు? పరిశుద్ధ దినానికి, ఆదివారానికి ఎంత విలువనిస్తున్నావు? పరిచర్యకు ఎంత విలువ నిస్తున్నావు? దేవుడంటే ఎంత భయభక్తులు కలిగియున్నావు? దైవజనులకు ఎంత విలువనిస్తున్నావు? వాక్యధ్యానానికి ఎంత విలువ నిస్తున్నావు? ప్రార్థనకు ఎంత విలువనిచ్చావు? విలువలేని నీ బ్రతుక్కు విలువనిచ్చాడే, రక్తాన్ని నీ కోసం ధారపోసి, రక్షణ నీ జీవితములో ప్రసాదించి, నిన్ను తీసుకొని కిరీటములో పొదిగించి ఉన్నత స్థానములో నిన్ను పెడితే దేవునికి ఈరోజు నీవు ఇచ్చే స్థానము ఏమిటి? ఒకసారి నీ హృదయం మీద చేతులుంచుకొని ఆలోచించు!

ఒకమనిషిమీద ఉన్న ప్రేమ, అప్యాయత, విలువ ఈరోజు దేవునిబిడ్డలు దేవునికి ఇవ్వడం లేదు. అవసరానికి దేవున్ని వాడుకుంటున్నారు. తర్వాత దేవున్ని విడిచి పెడ్తున్నారు. ఒకసారి ఆలోచించండి! దేవుడు నన్నే ఎందుకు ప్రేమించాలి? ఎందుకు నన్నే ఎన్నుకోవాలి? నా లాంటివారు ఎందరో ఈలోకంలో లేరా? అని ఆలోచించండి. ఎందుకంటే నరున్ని జ్ఞాపకం చేసుకొనుటకు నరుడు ఏపాటివాడు? ప్రభువు జ్ఞాపకం చేసుకోడానికి మనము అర్హత లేనివారము. అయినా దేవుడు మానవున్ని ప్రేమిస్తున్నాడు. అన్నిటికంటే ఎక్కువ విలువ మానవునికి ఇస్తున్నాడు. ఆయన నాకు ఇచ్చిన విలువను నేను గుర్తించగలిగాను గనుకనే సమస్తాన్ని విడిచి దేవునిమహిమగల పని చేసే కృప పొందుకున్నాను. ఆయన దయచేతనే ఈ యాజకత్వపు సేవనాకిచ్చాడు. ఒకవేళ దేవుడు నాకు ఇచ్చిన విలువను

నేను గుర్తించకపోతే నా బ్రతుకు ఎలా ఉండేదో? ఆలోచించడం కష్టమే.

ఈరోజు దేవుడు నీకు ఇచ్చిన విలువను గుర్తించగలిగితే నీ జీవితం కూడా చాలా ఆశీర్వాదకరంగా సాగుతుంది. నీవు వెండి, బంగారము, కారు, చక్కని గృహం సంపాదించడం ఆశీర్వాదం కాదు. దేవుడు నీకు ఇస్తున్న విలువను కాపాడుకునే కృప కలిగి వుండడమే ఆశీర్వాదం. నీవు ఎక్కడవున్నా రత్నంవలె ప్రకాశిస్తూవుండాలి. దేవుడు నిన్ను కిరీటంలో అమర్చిన రత్నంవలె ఉన్నతస్థానాన్ని రక్షణను, అభిషేకమును, ఉపదేశాన్ని, పరిచర్యను నీకు ఇచ్చి నీ జీవితాన్ని విప్లవాత్మకంగా మార్చాడు గనుక నీవు ఎక్కడవున్నా అమూల్యమైన వ్యక్తిగానే జీవించాలి.

యోసేపు దేవునియందు భయభక్తులు కలిగినవాడు. అపవిత్రత, శోధన జయించినవాడు, దేవుని చిత్తాన్ని నెరవేర్చినవాడు. చూడండి బానిసగా ఉన్న ఈ వ్యక్తి శరీరరీతిగా బానిస కాని ఆత్మీయంగా బానిస కాదు. దేవునికి అతని హృదయములో విలువను ఒక స్థానం ఇచ్చాడు. దేవుడు అతన్ని గొప్ప వ్యక్తిగా ఫరో అంతటివానిగా చేసాడు. దేశానికి కిరీటముగా రత్నంగా ఉంచారు. అందరు కిరీటం చూచిన రీతిగా కరువుకాలంలో అందరు యోసేపును కిరీటముగా చూసారు. ఘనత గొప్ప విలువ ప్రభువు ద్వారా కలుగుతుంది. అందుకే దేవుని బిడ్డలారా తలంపులకు ఊహలకు అందని గొప్ప దేవున్ని మనం కలిగియున్నాము. ఆయన మనకిచ్చిన స్థానాన్ని విలువను కాపాడుకొందుము గాకా.

## 3. ఎఫోదులో ఉన్న రత్నము

**ఎఫోదుకును పతకమునకును లేత పచ్చలును చెక్కు రత్నములును తీసికొని రావలెను (నిర్గమ 35:9).**

ప్రత్యక్షపు గుడారములో యాజకత్వాన్ని జరిగించే ప్రధాన యాజకునికి ప్రతిష్టితమైన వస్త్రాలు వుంటాయి. ప్రతిష్టించబడిన వస్త్రాలను యాజకుడు ధరిస్తాడు. మొదట తెల్లని అంగీ, తర్వాత నీలి అంగీని ధరించి దానిమీద ఎఫోదును ధరించాలి. ఈ ఎఫోదుపైన రత్నాలు పొదిగించాలి. యాజకుని భుజం మీద, ఎఫోదుపైన రత్నాలు పొదిగించి మందిరములో యాజకత్వం చేయాలి.

**పిమ్మట దావీదు ఎఫోదు తెమ్మని యాజకుడగు అహీమెలెకు కుమారుడైన అబ్యాతారుతో చెప్పగా అబ్యాతారు ఎఫోదును దావీదునొద్దకు తీసికొని వచ్చెను. నేను ఈ దండును తరిమినయెడల దాని కలిసికొందునా అని యెహోవాయొద్ద విచారణ చేయగా యెహోవా తరుము నిశ్చయముగా నీవు వారిని కలిసికొని తప్పక నీవారినందరిని దక్కించుకొందువని సెలవిచ్చెను (1సమూయేలు 30:7).**

యాజకుడైన అబ్యాతారు దగ్గర ఉన్న ఎఫోదును తెమ్మని చెప్పి తెచ్చినతర్వాత ఆ ఎఫోదును దావీదు ధరించి యెహోవాకు ప్రార్థన చేస్తున్నాడు. “నా భార్యపిల్లలను, ఆస్తినంతటిని శత్రువులు తీసుకువెళ్లారు. ఇదిగో ఆదండువారిని శత్రువులను నేను తరమాలా? లేదా? నేను వారిని పట్టుకోగలనా? వారిని నేను జయించగలనా? నా భార్యపిల్లలను నేను విడిపించగలనా? అని ఎఫోదును ధరించి ప్రార్థనచేయగా -

తరుముము, నీ వారినందరిని నీవు దక్కించుకుంటావని, వారిని జయిస్తావని దేవుడు సెలవిచ్చాడు.

ఎఫోదు అనగా దైవచిత్తం తెలుసుకొనుట. దైవచిత్తాన్ని తెలుసుకోవాలంటే ఎఫోదును ధరించాలి. ఏఫోదును ధరించుకొని దైవచిత్తాన్ని దావీదు తెలుసుకుంటున్నాడు. ఎఫోదులేకుండా ప్రార్ధన చేస్తే జవాబు రాదు. రత్నాలు ఎఫోదులో ఉన్నాయి. అ రత్నం ఎవరు? మనమే ఆ రత్నం. ఇప్పుడు రత్నంగా వున్న నీవు ఎఫోదులో ఉన్నావు. ఎఫోదు అనగా దైవచిత్తం గనుక ప్రతివిశ్వాసి కూడా దేవునిచిత్తాన్ని తెలుసుకొని జీవించాలి.

దేవుని చిత్తం తెలుసుకోకుండా నీవు ఏ పనిని చేసినా అది సఫలంకాదు కాని ఖచ్చితంగా అది విఫలమవుతుంది. ప్రతివిషయంలో దైవచిత్తాన్ని తెలుసుకునే రత్నంగా నీవు ఉండాలి. ఎఫోదులో ఉన్నరత్నం వలె దైవచిత్తాన్ని తెలుసుకునే విశ్వాసిగా నీవు జీవించాలి. దైవచిత్తం తెలుసుకోకుండా నీవు ఏ పనిని చేసినా విజయం ఉండదు. ఏ వ్యాపారం చేసినా విజయం ఉండదు. ఎందుకంటే దైవచిత్తం తెలుసుకోలేదు. అందుకే ఆపనిలో నీవు ఓడిపోతున్నావు. దేవుని చిత్తం లేకుండా నీవు చేసే ప్రతిపని ద్వారా నష్టమే. "నీ చిత్తమే నా జీవితములో నెరవేరాలి" అని నీవు నిత్యం దేవుని సన్నిధిలో ప్రార్ధించాలి. పరలోకంలో దేవుని చిత్తం దేవధూతలు ఎలాగు నెరవేరుస్తున్నాయో, ఆకాశంలో సూర్యుడు, నక్షత్రాలు, గ్రహాలు ఎలా దైవచిత్తాన్ని నెరవేర్చుతున్నాయో మనం కూడా ఈ భూలోకంలో ఆయన చిత్తమే చేయాలి.

సృష్టి దేవునిచిత్తం చేస్తుంది. సృష్టిలోఉన్న మానవునిగా దేవుని చిత్తం చేయడానికి నీవు ఇష్టపడుతున్నావా? దేవుని చిత్తాన్ని తెలుసుకున్న దావీదు తన భార్యపిల్లలను రక్షించుకున్నాడు. దేవుని చిత్తాన్ని తెలుసుకున్నవారు అన్ని కాపాడుకుంటారు. ఆరోగ్యాన్ని ఆస్తులను, పిల్లలను మీకున్న సర్వాన్ని కాపాడుకొని ఆశీర్వాదం దీవెన పొందుతారు.

## 4. సహవాసంలో ఉన్న రత్నము

**"నా జనులు యెహోవా దేశములో కిరీటమందలి రత్నములవలె నున్నారు" (జెకర్యా 9:16)**

దేశము అనగా సంఘము అని అర్ధము. రక్షింపబడిన విశ్వాసి రత్నానికి సాదృష్యమైతే అది యెహోవా దేశములో వుండాలి అంటే సంఘములో వుండాలి. సంఘములో ఉన్న నీవు శ్రేష్టమైన వ్యక్తిగా జీవించాలి. సంఘము సహవాసాన్ని చూయిస్తుంది. విశ్వాసులు ఎవరుకూడా సహవాసం లేకుండా ఉండకూడదు. ఆ సహవాసము అపోస్తులుల సహవాసమై యుండాలి. అపోస్తుల సహవాసములోనే అపోస్తుల బోధ దొరుకుతుంది. ఆ బోధ నిన్ను ప్రభురాకడకు సిద్ధపరుస్తుంది. ఎఫోదులో 12 గోత్రాలపేర్లు చెక్కబడి ఉంటాయి. ఇది సహవాసానికి సాదృష్యం. ఈ 12గోత్రాలను యాజకుడు భుజం పై చాతిపై మోయాలి.

ఎఫోదులో 12రత్నాలు ఎలాగు అయితే సహవాసం కలిగి ఉన్నాయో నీవు కూడా సంఘములో ప్రతిష్టింపబడిన దైవజనులతో, దేవునితో సహవాసం కలిగి వుంటే దేవుని

చిత్తమేమిటో నీ జీవితములో, నీ కుటుంబములో అన్ని విషయాల్లో తెలుసుకుంటావు. సహవాసం లేకుండా నీవు లోకంలో తిరిగావంటే అంతే సంగతి. సాతాను అలాంటి వారిని పట్టుకుంటాడు. యూదాను పట్టుకున్నాడు, తీసుకెళ్ళి చెట్టుకు వ్రేలాడదీసి, క్రిందపడేసి, పొట్టను పగలగొట్టాడు ప్రేగులు బయటపడ్డాయి. ఒంటరిగా వున్నారంటే ప్రమాదం పొంచియుంటుంది. సహవాసాన్ని సాతాను ఏమిచేయలేడు. అందుకే సంఘముతో ఎప్పుడు కలిసిమెలసి ఉండండి. సహవాసంలో గుంపులో ఉన్నవారిని ఎవరు తాకలేరు. సంఘ సహవాసంలో ఉంటే నీవు దైవచిత్తం తెలుసుకుంటావు. దేవుని చిత్తం నీకు అర్థమవుతుంది. దైవచిత్తాన్ని తెలుసుకొని దైవచిత్తానికి అనుగూనంగా ఎప్పుడైతే నీవు జీవిస్తావో అప్పుడే నీ జీవితములో అద్భుతాలు జరుగుతాయి.

కావున మన ప్రతిపనిలో ఉదయం లేచింది మొదలుకొని పడుకునేవరకు ఎక్కడికి వెళ్ళాలన్నా, ఏపని చేయాలన్నా, ఏ ప్రయాణం చేయాలన్నా, ఏది కొనాలన్నా దేవుని చిత్తంతెలుసుకొని ముందుకు సాగితే అన్నిటిలో జయం దొరుకుతుంది. కావున దేవుని సంఘములో ఉండి దేవునిచిత్తం తెలుసుకుంటూ మన జీవితయాత్రను కొనసాగిద్దాము.

నీవు ఎక్కడవున్నా నీ చుట్టు పరిస్థితులు ఎలా ఉన్నా దేవుని చిత్తాన్ని గ్రహిస్తూ బ్రతకాలి. ఒక అమూల్యమైన వ్యక్తిగా జీవించాలి. ఒక త్రాగుబోతుగా, ఒక వ్యభిచారిగా, దొంగగా, తిరుగుబోతుగా, వదురుబోతుగా విలువలేకుండా జీవించకూడదు. నీ భాషయేదైనా, నీ కులం ఏదైనా, నీరంగు, నీ జాతి, నీ ఊరు, నీ దేశం ఏదైనా నీవు ఒకరత్నంగా బ్రతకాలి. కాని కులం బుద్దులు, జాతిబుద్దులు, ఊరుబుద్దులు, పద్దతులు నీలో కన్పించకూడదు. నీ వస్త్రధారణలో నీ మాటలలో, నీ ప్రవర్తనలో, నీ తలంపుల్లో నీ జాతి, కులం, నీ భాష బేధం చూపించకూడదు. నీవు రత్నానివి అని జ్ఞాపకం చేసుకుంటూ రత్నంవలె జీవించాలి.

కాబట్టి రత్నాన్ని (నిన్ను) ఉంగరములో, వడ్డానంలో, కాలిక్రిందనో దేవుడు పెట్టకుండా కిరీటమందలి రత్నంవలె నిన్ను దేవుడు దాచాడు. కిరీటానికి ఉన్న స్థానం మరి దేనికి లేదు. అలాంటి ఉన్నతస్థానంలో నిన్ను నిలిపి నీకు ఉన్నతమైన విలువనిచ్చిన దేవునికి నీవు ఎంత విలువనిస్తున్నావు? అనేది ఈనాటి ప్రశ్న. నీ భార్య, పిల్లలకు, నీ భర్తకు, నీ తల్లిదండ్రులకు, నీ స్నేహితులకు, నీ రక్త సంబంధికులకు, విందులకు, వినోధాలకు, నీ ఉద్యోగానికి, నీ వ్యాపారానికి, నీ పొలానికి, నీ ఆరోగ్యానికి, నీ తిండికి, నీ నిద్రకు ఇస్తున్న విలువ నీ కొరకు రక్తంకార్చి ప్రాణంపెట్టి కిరీటంలో ఒక రత్నంవలె నిన్ను అలంకరించిన ఆ దేవునికి నీవు ఇస్తున్నావా? ఒకసారి ఆలోచించు! ఈరోజునుండి అయినా తీర్మాణం చేసుకో "ప్రభువా! అన్నిటికంటే ఎక్కువగా నిన్ను ప్రేమిస్తాను. నా జీవితములో మొదటిస్థానం నీకే ఇస్తానయ్యా అని ప్రభువుకు విలువనిచ్చి ఆయన ఆశీర్వాదము పొందుకుందాము.

ఆలాంటి కృప ప్రతిఒక్కరికి దేవుడు అనుగ్రహించును గాక! ఆమెన్...

# దైవజనులకు

**"యెహోవా సేవకులారా, యెహోవా మందిరములో రాత్రి నిలుచుండు వారలారా, మీరందరు యెహోవాను సన్ను తించుడి. పరిశుద్ధ స్థలమువైపు మీ చేతులెత్తి యెహోవాను సన్నుతించుడి (కీర్తన 134.1)."**

యెహోవా సేవకులు దేవుని మందిరములో నిలుచుండువారని అంతేకాక చేతులెత్తువారని పైలేఖన భాగములో చూస్తున్నాము. అనాదినుండి దేవుని పరిచర్య చేయుటకు ప్రతిష్ఠింపబడిన దేవుని సేవకులను దేవుడు ఏర్పరచుకున్నాడు. ఇశ్రాయేలు ప్రజల నిమిత్తము రాత్రిపగలు ప్రార్థించుట కొరకు సేవకులను ప్రత్యేకపరచుకున్నాడు. దేవుని సేవకుడు ఎల్లవేళల దేవుని మందిరములో లేక దేవుని సన్నిధిలో నిలబడాలి.

ప్రజలనిమిత్తము ధూపము వేయడానికి లేక ప్రార్థించడానికి సేవకులు దేవుని సన్నిధిలో నిలబడాలి చేతులెత్తాలి. కారణం ఏమిటంటే తన ప్రజలు లోకములో తిరుగుతుండగా దుష్టుడైన సాతాను గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని తిరుగుతున్నాడు. వారి ఆత్మీయ జీవితాన్ని కొనసాగించకుండా వారి పరిశుద్ధతను పాడుచేసి, ఆరోగ్యాన్ని పాడుచేసి, అపాయాలను కలుగజేసి, లోకమాలిన్యం అంటించి, వారిని సంహరించాలని తిరుగుతున్నాడు. అందుకే నిత్యము ప్రజలక్షేమముకోసం ప్రార్థించడానికి దేవుని సేవకులను ఏర్పరచుకున్నాడు.

ఇశ్రాయేలు ప్రజలు మోషే అహరోనులమీద తిరుగుబాటు చేసినప్పుడు దేవుని తెగులు దిగివచ్చి ఇశ్రాయేలీయులను చంపడం మొదలుపెట్టింది. అందునుబట్టి 14,700 మంది మరణించిరి. ఆ తెగులు ఇంకా వ్యాప్తి చెందుతుండగా సేవకుడైన అహరోను ధూపార్తిని తీసుకొని దానిని బలిపీఠపు నిప్పులతో నింపి ధూపద్రవ్యము వేసి చచ్చినవారికిని బ్రతికినవారికిని మధ్యలోనికి వెళ్ళి నిలబడగా ఆ తెగులు ఆగింది. **అతడు చచ్చినవారికిని బ్రతికియున్న వారికిని మధ్యను నిలువబడగా తెగులు ఆగెను (సంఖ్యా 16:48)** ఒకవేళ సేవకుడు నిలబడకపోతే ఆ తెగులు ఆగేది కాదు, ప్రజలు బ్రతికేవారు కాదు. సేవకుడు దేవుని సన్నిధిలో నిలబడడము ధూపము వేయడము ఎంత ప్రాముఖ్యమో ఇక్కడ మనము గమనించవచ్చు! అబ్రహాము సొదొమ పట్టణక్షేమము కొరకు దేవుని సన్నిధిలో నిలబడినాడు. అలాగునే సేవకులమైన మనము కూడా దేవుని సన్నిధిలో నశించిపోతున్న ఆత్మలకోసం, విశ్వాసులకోసం నిలబడాలి.

దేవుని సన్నిధిలో నిలబడే సేవకుని రొమ్ముపైన ఇశ్రాయేలీయుల పన్నెండు గోత్రాల పేర్లు కనిపిస్తున్నాయి. సేవకుని ముఖాన్ని దేవుడు చూస్తున్నప్పుడు సేవకుని రొమ్ముపై వున్న

ఇశ్రాయేలీయుల ప్రజల పేర్లను కూడా చూస్తున్నాడు. పేర్లను చూస్తున్నాడు అంటే దేవుడు తన ప్రజలను చూస్తున్నాడని అర్థం. అంటే ఇప్పుడు దేవుడు తన ప్రజలను దేవుని సన్నిధిలో నిలబడిన సేవకునిలో చూస్తున్నాడు. సేవకుడు ఎంత ప్రాముఖ్యమైన పని చేస్తున్నాడో ఇక్కడ అర్థమవుతుంది. విశ్వాసుల ముఖము నిత్యము ప్రభువు సన్నిధిలో కన్పించాలంటే సేవకుడు దేవుని సన్నిధిలో నిలబడుట ద్వారానే సాధ్యమవుతుంది. ఒకవేళ సేవకుడు ఆయన సన్నిధిలో నిలబడకపోతే విశ్వాసులు కూడా ఆయన సన్నిధిలో కనబడరని గ్రహించగలుగుచున్నాము.

అందుకే విశ్వాసులను నిత్యము దేవుని సన్నిధిలో కనిపించునట్లు చేసే దైవజనుని గౌరవించాలి, ప్రేమించాలి, సన్మానించాలి, వారికి లోబడియుండాలి. కొందరు సేవకుడు ఏం చేస్తాడండి? కేవలం ప్రార్థనా, వాక్యమే కదా మాకు బోధించేది! అంతకు మించి బరువు పని ఆయన చేసేది ఏమి లేదు కదా? అని తేలికగా సేవకున్ని తీసి పడేస్తారు. ఒకవేళ సేవకుడు నీ గురించి దేవుని సన్నిధిలో నిలబడకపోతే లేక ప్రార్థించకపోతే ఆదినము నీ పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందో నీవు ఆలోచించలేవు. ఆదినం నీకు వ్యాధియే రావచ్చు, నష్టమే జరగవచ్చు, యాక్సిడెంటే జరగవచ్చు, నీ పిల్లలకు అపాయమే జరగవచ్చు, నీ భార్యకు, నీ భర్తకు ఏదైనా సమస్యేరావచ్చు ఇంకేదైనా జరగవచ్చు చెప్పలేము. కారణమేమిటంటే నీ గురించి దేవుని సన్నిధిలో నిలబడే సేవకుడు లేనందువల్ల దుష్టుడు నీ కుటుంబముతో ఆటలాడుకుంటాడు.

అందుకే ఉదయము సాయంత్రము యాజకుడు ధూపము వేయుటకు గుడారములోనికి వెళ్ళాలి. దేవుని సన్నిధిలో నిలబడాలి. ఈరోజు నీ కుటుంబం గురించి నిలబడే సేవకుడు ఉన్నాడా?

ప్రియదైవజనుడా! ఈరోజు నీవు నమ్మకముగా విశ్వాసుల పక్షముగా దేవుని సన్నిధిలో నిలబడి ధూపము వేయగలుగుచున్నావా? లేక వ్యర్థంగా ఆ మీటింగ్ అని, ఈ మీటింగ్ అని అటూఇటూ తిరుగుతూ సమయాన్ని కాలక్షేపము చేస్తున్నావా? ఒకసారి ఆలోచించు! నీవు దేవుని సన్నిధిలో నిలబడడానికి పిలువబడ్డావు. నీ పిలుపును ఏర్పాటును మరచిపోకూడదు. సేవకుడవైన నీవు దేవుని సన్నిధిలో నిలబడడమును బట్టి ప్రజలకు ఎంత క్షేమము కలుగుతుందో ఒకసారి ఆలోచించు! ఈరోజులలో నిలబడేవారు తక్కువ, తిరిగేవారు ఎక్కువైపోయయారు. సాతానుకూడ అటు ఇటూ తిరుగువాడే. తిరుగుతూ తిరుగుతూ దేవుని సన్నిధికి వచ్చాడు అని యోబు గ్రంథంలో చూస్తున్నాము.

అందుకే అటుఇటూ తిరగడం ఆపివేసి, వ్యర్థమైనవి చూడడం ఆపివేసి, చాటింగ్

చేయడం ఆపివేసి, ఫోటోలు తీయడం, వాటిని వాట్సప్‌లో ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేయడం ఆపివేసి నిత్యము దేవుని సన్నిధిలో నిలబడి ధూపం వేసేవారుగా ఉండాలి. ఈరోజు చాలామంది సేవకులు సమయమంతా ఆన్‌లైన్‌లోనే గడుపుతున్నారు. దేవుని లైనేమో ఆఫ్ అయిపోయింది. లోకపులైను ఎక్కువైపోయింది. అందుకే సేవా అభివృద్ధిలేదు, నీ విశ్వాసులకు క్షేమము లేదు, నీ సేవలో సమాధానము లేదు, నీ సేవలో నూతన ఆత్మలు లేవు కారణం అదే. ఇప్పటికైనా ధీర్ఘముగా ఆలోచించి, ఒక అద్భుతమైన నిర్ణయాన్ని తీసుకొని నిత్యము అహరోను నిలబడినట్లుగా దేవుని సన్నిధిలో నీవు నిలబడగలిగినట్లయితే నీ సేవలో ఒక ఉజ్జీవాన్ని నీవు చూడగలుగుతావు, ఒక అభివృద్ధిని చూడగలుగుతావు, ఒక ప్రత్యేకమైన దైవకార్యాన్ని నీ సేవలో దేవుడు చేయడం నీవు కన్నులారా చూస్తావు.

అందుకే సేవకుడు ఎల్లవేళల దేవుని సన్నిధిలో నిలబడాలి. ఏలియా అంటున్నాడు **"ఎవని సన్నిధిలో నేను నిలబడియున్నానో ఇశ్రాయేలు దేవుడైన ఆ యెహోవా జీవముతోడు (1రాజులు 17:1)"**. ఏలియా ఆహాబురాజు సింహాసనము ముందు జనిలబడియున్నాడు కాని నేను దేవుని సన్నిధిలో నిలబడియున్నానని అంటున్నాడు. ఇలాంటి సాక్ష్యం నీవు చెప్పగలవా? సేవకుడు ఎక్కడ నిలబడినా అక్కడ దేవుని సన్నిధి ఉండాలి. దేవుని సన్నిధి ఉండాలంటే నశించిపోతున్న ఆత్మలపట్లభారం నీ గుండెల్లో మండుతూవుంటే నీవు ఎక్కడవున్నా పావురం వలె నీ హృదయం దేవుని సన్నిధిలో మూల్గుతూవుంటుంది.

ఈ విధముగా లోకములో నిలబడుటకంటే దేవుని సన్నిధిలో నిలబడడం ఎంత ఆశీర్వాదమో! అందుకే దేవుని సన్నిధిలో నిలబడిన మన పితరులైన సేవకులను చూసి మనము కూడా దేవుని సన్నిధిలో నిలబడి ప్రజలకు పట్టణానికి విశ్వాసులకు ఆశీర్వాదకరముగా ఉందుము గాకా! ఆమెన్...


నిస్సీ

**బైబిల్ సెమినార్**

**2017 జూలై 1వ తేదీ నుండి 31 వ తేది వరకు**

స్థలము : నిస్సీ ప్రార్థన మందిరము **నిర్మల్**

భోదించువారు: **పరిశుద్ధాత్మ దేవుడు**

వివరములకు మరియు అప్లికేషన్ ఫారములకు సంప్రదించవలసిన మా చిరునామా

**నిస్సీ మినిస్ట్రీస్**

శాస్త్రీ నగర్, నిర్మల్ జిల్లా

www.nissiministries.co.in cell:9390011485, 7702348500

# నిస్సీ

## పాటల సి.డి.లు

1. నా దాగుచోటు నీవే
2. మహోఘనుడా
3. ఇంపైన సువాసన
4. కృతజ్ఞతార్పణలు
5. నా గమ్యము నూతన యెరుషలేము
6. ఇశ్రాయేలు దేవా
7. స్తోత్రార్పణ NEW

## విసిడిలు మరియు డివిడిలు

1. నేను మీకు క్షేమము కలుగజేసెదను
2. మలిన వస్త్రాలు
3. నాకు దీవెన దయచేయుము
4. నీ సూర్యుడికను అస్తమింపడు
5. ధైర్యము తెచ్చుకొనుము
6. నిరీక్షణ
7. నిన్ను నడిపించును
8. సౌందర్యము
9. ఐక్యత
10. ఆలోచన
11. సిలువను మోయుట
12. జయించిన వారికి ఆశీర్వాదము
13. దేవుని ఆత్మను నెమ్మది పరచుట
14. పైకి లేపు వాడు
15. షిత్తీము లోయ 1
16. షిత్తీము లోయ 2
17. యాకోబులో వంకరతనము లేదు
18. యాకోబు
19. బలవంతులుగా మార్చే దేవుడు
20. మీరు దేవుని వ్యవసాయమైయున్నారు

## ప్రసంగముల ఆడియో సి.డి.లు

1. పాపములో మరణించుట
2. పరిశుద్ధత గుర్చి దర్శనము
3. రమ్యమైన గుడారము
4. దహించు అగ్ని
5. ఆమె దీపము ఆరిపోదు
6. బలవంతుని చేతిలో
7. నా క్షేమానికి ఆధారం
8. నీవేమి ధరించితివి
9. పక్షి రాజు
10. అగ్ని జ్వాలలు
11. దీన మనస్సు తో చేసిన ప్రార్ధన
12. దైవ నడిపింపు
13. అంజూరపు చెట్టు
14. పరలోకపు అగ్ని , పాతాళపు అగ్ని
15. కలత చెందనివాడు
16. ఉధ్యానవనము
17. సిద్ధపాటు
18. క్షయభీజము అక్షయ భీజము
19. ఎండిన ఎడారిలో లేతమొక్క
20. గోపురము
21. జయము మనదే
22. లెబనోను సౌంధర్యం
23. దైవజనుని మాట వినుట

## మా పుస్తక ప్రచురణలు

1. క్రైస్తవ కుటుంబం
2. నిస్సీ వర్తమానాలు
3. బ్రతుకు బ్రతుకుగా మారుట

పాటల సి.డి ఒక్కటి 50రూ॥. ప్రసంగములు ఒక్కటి 30రూ॥ విసిడి, డివిడి ఒక్కటి 50రూ॥లు కావలసినవారు పోస్టు ద్వారా మనియార్డరు పంపి వీటిని పొందగలరు. పోస్టల్‌చార్జీలు అదనం.

మా అడ్రస్ ...

**Nissi Ministries, H.No. 1-3-132/A6**
**ShastriNagar, Nirmal-dist. 504106**
**Phone:08734-240147, 9390011485**

Regd. of Newspaper of India
TELTEL/2015/60909

Regd. No. ADB/012/2012-14
License to post on concessional rates

Printed matter

To,

# నిస్సీ మినిస్ట్రీస్

శాస్త్రీనగర్, నిర్మల్ 504106

ఫోన్ : 08734-240147, 9390011485

Website: www.nissiministries.co.in

Email ID: nissi.jayadwajamu@gmail.com

Published By: M. Priyadarshini W/o M. jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal Dist. Pin: 504 106

Edited Printed & Owned by: Pastor. M. Jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal Dist. Pin: 504 106